క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల గడువు పెంపు

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థ ఉట్నూర్(ఐటీఐ)లో మూడో దశ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులు కనీసం 8/10 తరగతులు ఉత్తీర్ణులై ఉండాలన్నారు. వివరాలకు 98664 35005 సంప్రదించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం: జిల్లా విద్యా శిక్షణా సంస్థలో గెస్ట్ లెక్చరర్‌లుగా పని చేసేందుకు అర్హత కలిగి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు పూర్తి చేసిన బయోడెటా, ఫొటోలతో విద్యార్హతలకు సంబంధించిన జిరాక్స్ కాపీలను జత చేస్తూ స్థానిక డైట్ కళాశాలలో ఈనెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డెమో క్లాసుల ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌ను నియమించాలి

నేరడిగొండ: మండలంలోని సావర్గాం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్‌ను నియమించాలని గ్రామస్తులు కోరారు. మంగళవారం ఐసీడీఎస్ పీడీకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామంలో గత 30 సంవత్సరాలుగా అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుందన్నారు. చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు చదువు అందకుండా పోతుందన్నారు. వెంటనే టీచర్ పోస్టును భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాథోడ్ ఇందల్ నాయక్, కారోబారి కిషన్, జాదవ్ భీంరావు, ధారా సింగ్, తుకారాం పాల్గొన్నారు.

మైక్‌సెట్ విరాళం

తాంసి: మండలంలోని వడ్డడి ప్రాథమికోన్నత పాఠశాలకు మైక్‌సెట్ విరాళంగా అందజేశారు. బోరిగామ ఉన్నత పాఠశాలకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ మంగళవారం వడ్డాడి పాఠశాలలో హెచ్‌ఎం రమేశ్ రూ.5వేల విలువ గల మైక్‌సెట్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మమత, ఆశన్న, వేణు పాల్గొన్నారు.

పంటల సాగు పద్ధతులపై అవగాహన

ఆదిలాబాద్‌రూరల్: రైతుల సందేహాలు, వ్యవసాయంలో మెళుకువలపై మంగళవారం వ్యవసాయశాఖ చేపట్టే రైతునేస్తం కార్యక్రమం మంగళవారం మావల మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మొక్కజొన్న సాగు, రైతులు అవలంబించాల్సిన పద్ధతులు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఏఈవో కంది గంగారెడ్డి, ఏవో విశ్వామిత్ర వెండి, అట్ల గోవర్ధన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణను నిలిపి వేయాలి'

ఇచ్చోడ: ఎస్సీ వర్గీకరణను వెంటనే నిలిపివేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు శాంతపురం రాజేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై ప్రధాన మంత్రి మోదీ చిత్రపటాన్ని దహనం చేశారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 341ని సవరించకుండానే అన్నదమ్ములుగా కలిసి ఉన్న ఎస్సీలను విడదీసి కులాల మధ్య చిచ్చురేపుతున్నారని ఆరోపించారు. త్వరలో వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో కొప్పుల శంకర్, అంగుర్ల నాగన్న, సల్లం రమేశ్, కటకం వెంకటేశ్, రాజు, గంగయ్య పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

తలమడుగు: మండలంలోని బరంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలంగాణ భాష తెలంగాణ యాసపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష, తెలుగు ఉపాధ్యాయులు అమరేందర్, , మహేందర్, వాణి, సుజాత, సంగీత, తదితరులు పాల్గొన్నారు

అంబేద్కర్ ఫొటో ఉంచాలి

కైలాస్‌నగర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15న పోలీస్ పరేడ్‌మైదానంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే వేడుకల్లో భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్ ఫొటోను ఉంచాలని పలు దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ రాజర్షి షాను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. రత్నజాడే ప్రజ్ఞాకుమార్, బాల శంకర్, కృష్ణ పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని సాగర గ్రామానికి చెందిన సక్కారం ఇటీవల గుండెకు సంబంధించిన చికిత్స చేసుకోవడంతో ఆయనను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

కలగానే డబుల్ రోడ్డు!



కాంఘర్‌పూర్ శివారులో అధ్వానంగా సాంగిడి రింగ్ రోడ్డు

- సాంగిడి(రింగ్) డబుల్‌రోడ్డు నిర్మాణానికి రూ.25కోట్లు మంజూరు
- ఇప్పటికీ పూర్తికాని టెండర్ ప్రక్రియ
- సాంకేతిక కారణాలతో ప్రారంభం కాని పనులు

బేల: మండలంలోని పెన్‌గంగ పరీవాహక ప్రాంతాలు దహెగాం, మణియార్‌పూర్, గూడ, కాంఘర్‌పూర్, బెదోడ, సాంగిడి గ్రామాలకు వెళ్లే బీటీ రింగ్ రోడ్డు డబుల్ రోడ్డుగా నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. దీంతో డబుల్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గత మేలో సీఆర్‌ఎఫ్‌ఏ కింద రూ.25 కోట్లు మంజూరు చేసింది. కానీ సాంకేతిక కారణాలతో ఇంతవరకు పనులు ప్రారంభించలేదు.

నిధులు మంజూరు..

353బీ జాతీయ రహదారి మార్గంలో బేల మండలంలోని దహెగాం గ్రామ క్రాస్‌రోడ్డు నుంచి జైనథ్ మండలంలోని కాప్రి గ్రామ జంక్షన్ క్రాస్‌రోడ్డు వరకు 19 కిలోమీటర్ల మేర సింగిల్ బీటీ రింగ్ రోడ్డు ఉంది. ఈ మార్గంలో దహెగాం, మణియార్‌పూర్, గూడ, బెదోడ, సాంగిడితో పాటు జైనథ్ మండలంలోని ఉమ్రి గ్రామ శివారుల్లో లోలెవల్ వంతెనలు ఉన్నాయి. దీంతో పాటు ఈ మార్గంలో 8 కల్వర్టులు ఉన్నాయి. ఏటా వర్షాకాలంలో లోలెవల్ వంతెనలు, సింగిల్ రోడ్డుతో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఏళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో రోడ్డంతా గుంతలతో అస్తవ్యస్తంగా మారింది. ఈమార్గంలో ఐదారు నెలల నుంచి ఆర్టీసీ బస్సు రాకపోకలు సైతం బందయ్యాయి. హైలెవల్ వంతెనలు, డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని మండల ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్‌లకు స్థానికులు విన్నవించారు. ఈక్రమంలో గత ప్రభుత్వం నిధుల మంజూరు చేయగా మణియార్‌పూర్, ఉమ్రి గ్రామాల శివారుల్లో లోలెవల్ వంతెనల నిర్మాణ పనులు గత ఏప్రిల్ నుంచి కొనసాగుతున్నాయి. దీంతో పాటు ప్రస్తుత ఎమ్మె ల్యే పాయల్ శంకర్ ప్రత్యేక చొరవతో గత మే నెలలో కేంద్ర ప్రభుత్వం దహెగాం –సాంగిడి –కాప్రి సింగిల్ రోడ్డు డబుల్ రోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేసింది. కాగా టెండర్ ప్రక్రియ పూర్తికాకపోవడం.. సాంకేతిక సమస్యలతో రోడ్డు నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

అధ్వానంగా సింగిల్ రోడ్డు



పెన్‌గంగ పరీవాహక ప్రాంతంలోని గ్రామాలకు వెళ్లే ఏళ్ల క్రితం నాటి సాంగిడి రింగ్ రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారింది. మరమ్మతులు చేపట్టకపోవడంతో పెద్ద గుంతలతో సింగిల్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. గుంతలు పూడ్చడానికి బండ రాళ్లు వేసుకున్నాం. కానీ ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం స్పందించడం లేదు.

– గేడం ప్రమోద్, కాంఘర్‌పూర్

డబుల్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలి



మా గ్రామాల నుంచి వెళ్లే రింగ్ రోడ్డు డబుల్ రోడ్డుగా నిర్మాణం చేపట్టాలని పలుమార్లు మండల నాయకులు, అధికారులకు విన్నవించాం. ప్రస్తుతం రోడ్డుపై పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం డబుల్ రోడ్డు మంజూరైందని ఐదారు నెలలుగా అధికారులు చెబుతున్నారు. కానీ ఇంకా నిర్మాణ పనులు ప్రారంభించలేదు.

– దొలే సందీప్, గూడ

బంద్ విజయవంతం



బేల: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



గుడిహత్నూర్: తెరుచుకోని దుకాణాలు

బేల: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండిస్తూ మండల హిందూ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బంద్ నిర్వహించారు. స్థానిక జాతీయ రహదారిపై శివాజీ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు హిందూ సంఘాల నాయకులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. దాడులను వెంటనే ఆపివేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ మండల అధ్యక్షుడు బెదుర్కర్ ప్రఫుల్, మండల భజరంగ్‌దళ్ అధ్యక్షుడు అగార్కర్ అకాష్, బోనిగిరివార్ గణేష్, బర్కాడే రాము, పోత్రాజ్ నవీన్, ప్రీతం, సందీప్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ ఐక్య సంఘాల పిలుపు మేరకు చేపట్టిన బంద్ మండలంలో సంపూర్ణంగా జరిగింది. వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్ పాటించి మద్దతు తెలిపారు. బంద్ కారణంగా మండల కేంద్రం నిర్మానుష్యంగా మారింది. విద్యాసంస్థలు బంద్ పాటించక పోవడంతో హిందూ ఐక్య సంఘాల నాయకులు వెళ్లి పాఠశాలలు మూయించారు. ఈ క్రమంలో స్థానిక ఆదర్శ పాఠశాలకు చేరుకున్న నాయకులు పాఠశాల బెల్ మోగించి విద్యార్థులకు సెలవు ప్రకటించారు. ఈ క్రమంలో నినాదాలు చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రిన్సిపాల్ శివాజీ పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేశారు.

భారీ ర్యాలీ

తలమడుగు: మండలంలోని కుచులాపూర్ గ్రామం నుంచి మంగళవారం హిందు వాహిని ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందూ దేవాలయాలపై చేస్తున్న దాడులను ఖండిస్తున్నామన్నారు. కుచులాపూర్ నుండి, సుంకిడి, ఉండమ్, ఖోడత్, పోన్నరి గ్రామాల మీదుగా జిల్లా కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు.

బోథ్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బోథ్ మండల వ్యాప్తంగా మంగళవారం హిందూ సంఘాలు నిర్వహించిన బంద్ విజయవంతమైంది. వెంటనే దాడులువ ఆపాలని డిమాండ్ చేశారు. బోథ్‌తో పాటు సొనాల గ్రామంలో దుకాణాలు మూసి ఉంచారు. మండల వ్యాప్తంగా నిర్వహించిన బంద్‌లో ప్రజల, వ్యాపారులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

16న ఇచ్చోడ బంద్

ఇచ్చోడ: ఈనెల 16న తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బంద్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సన్మానం

బేల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆదిలాబాద్ అర్బన్ మండలానికి బదిలీపై వెళ్తున్న మండల సర్వేయర్ గోవింద్‌నాయక్‌ను మండల తహసీల్దార్ సిడాం వామన్‌రావు ఘనంగా సన్మానించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాజిద్, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

- బేల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఏడు ఏళ్లుగా ప్రిన్సిపాల్‌గా పనిచేసి, ఆదిలాబాద్‌లోని బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్‌ను మంగళవారం అధ్యాపక బృందం, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భగవాండ్లు, ఎన్‌ఎస్‌ఎస్ ఇంచార్జి రూపేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ఇటీవల హజ్, మక్కా యాత్రను పూర్తిచేసుకుని వచ్చిన మావల మండల మాజీ కోఆప్షన్ సభ్యులు రహీం ఖాన్‌ను మంగళవారం తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు.

కై లాస్‌నగర్: టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ సమన్వయకర్తగా నియమితులైన డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌ను కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అభినందించారు. మంగళవారం పట్టణంలోని ప్రజాసేవాభవన్‌లో శాలువాతో సత్కరించి అభినందించారు.

బీమా సౌకర్యం కల్పించడం అభినందనీయం



బీమా బాండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఇచ్చోడ: పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత బీమా సౌకర్యం కల్పించడం అభినందనీయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ లోక శిరీష్‌రెడ్డిలు సొంత డబ్బుతో బీమా కల్పించారు. ఈసందర్భంగా బీమా పొందిన వారికి బాండ్లు పంపిణీ చేశారు. పేద ప్రజలకు సాయం చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు. అనంతరం 30 మంది లబ్ధిదారులకు రూ 9,97,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఏనుగు కృష్ణారెడ్డి, రాథోడ్ సజన్‌లాల్, పాండురంగ్, మోహరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని కుమారి గ్రామంలో గురుదేవ్ సేవాశ్రమాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్, శ్రీకాంత్, పాండు పాల్గొన్నారు.


హోండా స్మార్ట్ వర్క్‌షాప్ ప్రారంభం



హోండా స్మార్ట్ వర్క్‌షాప్ ప్రారంభంలో సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలో మంగళవారం శ్రీ మహాలక్ష్మి హోండా షోరూం వారు తమ స్మార్ట్ వర్క్ షాప్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించారు. వర్క్ షాప్ మా హోండా వినియోగదారులకి అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషంగా ఉందని సంస్థ డైరెక్టర్ నల్ల నకుల్ రెడ్డి అన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో షోరూం మేనేజింగ్ డైరెక్టర్ జనరల్ మేనేజర్ కొంకటి శ్రావణ్ కుమార్, సర్వీస్ మేనేజర్ అశోక్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అయిలబాయికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

బేల: మండల కేంద్రంలోని మార్కెట్ కూడలిలో మండల కురుమ, యాదవ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రాజమాత అయిలబాయి హోళ్కార్ 230వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అయిలబాయి చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గొల్ల కురుమ యాదవ సంఘాల నాయకులు గోరే విశాల్, పోత్లే అమోల్, నిపుంగే గణేష్, పొత్లే అజయ్, కాలే శంకర్, గోహర్కర్ రాజు, నిపుంగే వైభవ్, తదితరులు పాల్గొన్నారు.

'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ అతిక్ బేగం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్‌టేకర్ చంద్రకాంత్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో స్వప్న, సీనియర్ లెక్చరర్లు గణపతి, రఘు, కోటయ్య, బోధన, బోధనేతర సిబ్బంది, క్యాడెట్లు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

'వసతి' సిబ్బందిలో ఏసీబీ గుబులు

ఆదిలాబాద్‌రూరల్: వసతిగృహాల్లో ఉంటూ చదువుతున్న పేద విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం , సరుకుల నాణ్యత, పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల హాజరు నమోదు చేస్తున్నారా? లేదా? ప్రణాళిక ప్రకారం విద్య బోధన కొనసాగుతుందా? లేదా? అనే అంశాలను పరిశీలించేందుకు ఏసీబీ అధికారులు రాష్ట్రంలో పలుచోట్ల మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగానే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లోని వసతి గృహాలను ఏసీబీ అధికారులు తనిఖీ చేశారు.

ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 54 వసతి గృహాలు కొనసాగుతుండగా సుమారు 15వేల మంది విద్యార్థులు ఉంటూ చదువుకుంటున్నారు. బీసీ అభివృద్ధి శాఖ పరిధిలో 14 వసతి గృహాలు ఉండగా సుమారు పదకొండు వందల మంది విద్యార్థులు ఉన్నారు. దళితాభివృద్ధి శాఖ పరిధిలో 21 ఉండగా 12,091 మంది విద్యార్థులు ఉన్నారు. మైనార్టీ అభివృద్ధి శాఖ పరిధిలో 6 గురుకుల పాఠశాలలు ఉండగా 1500 విద్యార్థులు ఉన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో కూడా తనిఖీలు చేస్తారా అని హెచ్‌డబ్ల్యూవోలు, వసతి గృహ సిబ్బందిలో గుబులు మొదలైంది.

'మాటల సీఎం కాదు చేతల సీఎం'



మాట్లాడుతున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి మాటల సీఎం కాదని, చేతల సీఎం అని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రాష్ట్రానికి భారీగా విదేశీ పెట్టుబడులు తీసుకువచ్చారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల వ్యవధిలోనే 19 కంపెనీలతో ఒప్పందం చేసుకుని దాదాపు రూ.73 వేల కోట్ల పెట్టుబడులు తీసుకురావడం జరిగిందన్నారు. ఇప్పటికే ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారంటీ హామీలను నెరవేర్చి ప్రజల ఆదరాభిమానులు చూరగొన్నారని, తాజా పెట్టుబడులతో వారికి మరింత చేరువయ్యారని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో ప్రజలకు ఒరిగిందేమీలేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జి.నగేశ్, నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సంసిద్ధం కావాలి

కై లాస్‌నగర్: త్వరలో జరుగనున్న గ్రామ పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికలకు సంసిద్ధం కావాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం ప్రజా సేవా భవన్‌లో ఆదిలాబాద్ నియోజకవర్గంలోని మావల, బేల మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

బీసీలంతా ఐక్యంగా ఉండాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌రూరల్: జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలంతా ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పథకానికి దరఖాస్తు చేసుకునే విధానంతో పాటు బ్యాంకు సేవల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజ్యాధికారం సాధించే దిశగా బీసీలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. రుణాల కోసం అనేక నియమాలు ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోదీ పీఎం విశ్వకర్మ యోజనను ప్రవేశపెట్టి రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బీసీ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన మేమెంతో మాకు అంతా పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, ఆదినాథ్, రాజేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తుడుందెబ్బ మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన సభ్యులు

ఉట్నూర్‌రూరల్: తుడుందెబ్బ ఉట్నూర్ మండల కమిటీని మంగళవారం ఆదివాసీ భవన్‌లో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కబాపురావు, రాష్ట్ర కార్యదర్శి నగేశ్, ఉపాధ్యక్షుడు తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు జంగుదేవ్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పెందూర్ త్రిమూర్తి, కార్యనిర్వాహణ అధ్యక్షుడిగా మడావి జంగు, ఉపాధ్యక్షుడిగా టేకం హరిప్రసాద్, గోడం ఆశిశ్, సిడాం బాపురావు, మరప గోదిరావు, పెందూర్ తుకారాంలను ఎన్నుకున్నారు. అదే విధంగా ప్రధాన కార్యదర్శిగా గుర్జాల రవీందర్, కోశాధికారిగా పెందూర్‌మోతీరాం, సంస్కృతిక కార్యదర్శిగా కుడిమెత శ్యాంరావు, సోషల్ మీడియా కన్వీనర్‌గా గేడం ఈశ్వర్, ప్రచార కార్యదర్శులుగా కుమ్ర కిషన్, మడావి గజానంద్, పెందూర్ జనార్దన్, సలహాదారులుగా నైతం చిత్రు, మరప బాదిరావు, సిడాం సోనేరావు, జైవంత్‌రావు, మానిక్‌రావులను ఎన్నుకున్నారు.

ప్రొఫెసర్ కోదండరాంను కలిసిన సమగ్రశిక్షా ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ సమగ్ర ఉద్యోగుల సంఘం నాయకులు ప్రొఫెసర్ కోదండరాం, సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, విద్యశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశ్‌లను మంగళవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, సంఘ బాధ్యులు అనిల్‌చారి, ఖాదర్, కరుణాకర్ పాల్గొన్నారు.

'అక్రమంగా తవ్వకాలు చేపడితే చర్యలు'

నార్నూర్: మండల కేంద్రంలోని జీన్‌గూడ సమీపంలో గల ప్రభుత్వ భూమిలో మంగళవారం తహసీల్దార్ జాడి రాజలింగు ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేశారు. గతంలో తవ్వకాలు నిలిపి వేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఉట్నూర్ ఆర్డీవో వినతిపత్రం అందజేశారు. దీంతో ఆ ప్రాంతాన్ని సందర్శించి మాట్లాడారు. ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసినా.. అక్రమంగా తవ్వకాలు చేపట్టిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తవ్వకాలు జరిపితే సంబంధిత వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఆర్ఐ సురేందర్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



బహుమతులు, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: ఎయిడ్స్ డే సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. ఆయా పోటీల్లో విద్యార్థులు మొదటి బహుమతి రూ.వెయ్యి, ద్వితీయ బహుమతి రూ.750, మూడో బహుమతి రూ. 500 అందుకున్నారు. డ్రామా విభాగంలో ప్రథమ బహుమతి, రీల్ మేకింగ్ విభాగంలో ద్వితీయ, తృతీయ బహుమతి, రన్నింగ్ విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులను అందించడంతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జగ్‌రాం అంతర్వేది, సీనియర్ లెక్చరర్లు సంగీత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అష్రఫ్ అలీ, లెక్చరర్లు శ్రావణి, రాడపు సంతోష్ పాల్గొన్నారు.